సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం ॥ 9 ॥ అక్టోబర్ ॥ 2025



చేనేత రుణమాఫీ ఏమాయే!
చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి 13 నెలలు అవుతున్నా అమలుకు నోచుకోలేదు.

- 8లో



జవాన్ అంత్యక్రియలు
మేడిపల్లికి చెందిన ఆర్మీ జవాన్ కోమరాజు కరుణాకర్ అంత్యక్రియలు సైనిక లాంఛనాలతో జరిగాయి.

- 8లో



పత్తి రైతు పరేషాన్
పత్తి రైతులకు ఏటా నిరాశే ఎదురవుతోంది. ఈ ఏడాది కూడా వర్షాల కారణంగా చేలకు ఎర్ర తెగులు సోకింది.

- 9లో

న్యూస్‌రీల్

మద్యం టెండర్లకు 157 దరఖాస్తులు
భువనగిరి : జిల్లాలో కొత్త మద్యం దుకాణాల కోసం టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం 82 దుకాణాలకు గత సెప్టెంబర్ 26 నుంచి టెండర్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. బుధవారం 25 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు మొత్తం 157 దరఖాస్తులు వచ్చాయి. టెండర్లకు ఈ నెల 18 వరకు గడువు ఉంది.

ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు



బొమ్మలరామారం : ధర్మారెడ్డిగూడెంలో పెసర పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆత్మకూరు(ఎం), బొమ్మలరామారం : ప్రతి గ్రామంలోని రైతులకు నాణ్యమైన వరి, పెసర విత్తనాలు అందించేందుకు కృషిచేస్తున్నామని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, జిల్లా ప్రధాన శాస్త్రవేతలు డాక్టర్ డి.శ్రీలత, డాక్టర్ బి.అనిల్ కుమార్ అన్నారు. బుధవారం వారు ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురం, కూరెళ్ల, పల్లెర్ల, బొమ్మలరామారం మండల కేంద్రం తోపాటు నాగినేనిపల్లి, మర్యాల, మేడిపల్లి, తిరుమలగిరి, ధర్మారెడ్డిగూడెం గ్రామాల్లో వరి, పెసర విత్తనోత్పత్తి క్షేత్రాలను పరిశీలించి మాట్లాడారు. జూన్ మొదటి వారంలోనే పరిశోధన కేంద్రాల్లో వరి కేఎస్ఎం-1638 రకం, పెసర ఎంజీజీ-295 రకం విత్తనాలను అభివృద్ధి చేశామన్నారు. వీటిని ఇప్పటికే రెవెన్యూ గ్రామానికి ముగ్గురిని ఎంపిక చేసి వ్యవసాయ శాఖ పంపిణీ చేసిందన్నారు. వారి వెంట ఏఈఓలు సరిత, క్రాంతి, రైతులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ మానసిక ఆరోగ్యంగా ఉండాలి



మాట్లాడుతున్న శాంతాసింగ్

బీబీనగర్: ప్రతిఒక్కరూ మానసిక ఆరోగ్యంగా ఉంటేనే సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొవచ్చని బీబీనగర్ ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బీబీనగర్‌లో ఎయిమ్స్ వైద్య కళాశాలలో మనోరోగ చికిత్స విభాగం ఆధ్వర్యంలో బుధవారం మానసిక ఆరోగ్యంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. అలాగే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం ముగియడంతో స్మారక వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మానసిక ఆరోగ్యంపై ఎంబీబీఎస్ విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించదారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డీన్ నితిన్ అశోక్ జాన్, మెడికల్ సూపరింటెండెంట్ మహేశ్వర్ లక్కిరెడ్డి, వైద్యులు సంగీత సంపత్ తదతరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఆలేరు పీఎంశ్రీ స్కూల్‌లో ఏటీఎల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా సైన్ అధికారి రాజశేఖర్

ఆలేరు: మారుతున్న కాలానుకనుగుణంగా విద్యార్థులు అడ్వాన్స్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా ఉపాధ్యాయులు ఆధునిక పరికరాలతో బోధన చేయాలని జిల్లా సైన్స్ అధికారి(డీఎస్ఓ) పులుమద్ది రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఆలేరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాలో సాంకేతిక బోధనకు ఎంపికైన ఆలేరు, రాజాపేట పీఎంశ్రీ పాఠశాలలకు చెందిన ఎనిమిది మంది ఉపాధ్యాయులకు అగ్మెంటేషన్ రియాలిటీ(ఏఆర్), వర్చువల్ రియాలిటీ(వీఆర్) సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టికరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)ను డీఎస్ఓ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జిల్లాలోని ఇతర పీఎంశ్రీ స్కూళ్లలో ఈ తరహా బోధన అందుబాటులోకి వస్తుందన్నారు. తెలిపారు. అనంతరం టెక్నికల్ ట్రైనర్ అఖిల్.. ఏఆర్, వీఆర్ హెడ్‌సెట్‌ల పనితీరు, బోధన విధానం తదితర సాంకేతిక అంశాలపై వివరించారు. ఆలేరు పాఠశాల హెచ్ఎం దాసరి మంజుల, ఉపాధ్యాయులు రావుల సత్యనారాయణరెడ్డి, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు
యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన వంటి పూజలు చేపట్టారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు భక్తులచే జరిపించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

స్వామి అమ్మవార్లకు హారతినిస్తున్న అర్చకుడు



భువనగిరిలో కురుస్తున్న వర్షం

మోస్తరు వర్షం
భువనగిరిటౌన్ : జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఎక్కువ నమోదు కావడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి ఉరుములతో కూడిన వర్షం కురిసింది. బొమ్మలరామారం మండలంలో 38 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, భువనగిరిలో 30, చౌటుప్పల్ 26, పోచంపల్లి 24, యాదగిరిగుట్ట, మోటకొండూరులో 13 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాగల రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భువనగిరిలోని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎల్లో అలర్ట్ ప్రకటించారు.

ప్రాదేశిక పోరుకు సై

తొలి విడత ఎన్నికలకు నేడే నోటిఫికేషన్ విడుదల
- 10 జెడ్పీటీసీ, 84 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ
- ఈ నెల 23వ తేదీన పోలింగ్
- నవంబర్ 11న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి



ఆలేరు ఎంపీడీఓ కార్యాలయం

సాక్షి, యాదాద్రి : జెడ్పీ, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల తొలి విడత ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. నోటిఫికేషన్ విడుదల రోజు నుంచే ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణకు ఇప్పటికే జిల్లాలోని అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లు స్వీకరిస్తారు. జిల్లాలో మొత్తం 178 ఎంపీటీసీ స్థానాలు, 17 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. ఇందులో తొలి విడతలో భాగంగా ఈ నెల 23న ఆలేరు నియోజకవర్గంలోని ఎనిమిది, తుంగతుర్తి నియోజకవర్గంలోని రెండు మండలాల్లో 84 ఎంపీటీసీ, 10 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. అలాగే రెండో విడతలో భాగంగా భువనగిరి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల్లోని 7 జెడ్పీటీసీ, 94 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు జరుగుతాయి.

నేటినుంచే నామినేషన్ల స్వీకరణ

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు గురువారం ఉదయం నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ మేరకు అధికారులు ఆయా స్థానాల వారీగా రిటర్నింగ్ అధికారులు రిజర్వేషన్లు, ఓటరుజాబితాలను ప్రకటిస్తారు. నామినేషన్లను మూడు రోజుల వరకు అంటే ఈనెల 11 వరకు స్వీకరిస్తారు. 12న పరిశీలన, 15వ తేదీన ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. ఈనెల తొలి విడత 23 పోలింగ్ జరుగనుంది. నవంబర్ 11న ఓట్లు లెక్కించి విజేతలను ప్రకటిస్తారు.

ఉదయం 10.30 గంటల నుంచి నామినేషన్లు

అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీల కోసం ప్రత్యేకంగా కౌంటర్లు పెట్టారు. అన్ని ఎంపీడీఓ కార్యాలయాల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. ఈ డెస్కుల్లో పనిచేసే సిబ్బంది నామినేషన్ ఫారాలు, ఇతర సలహాలు ఇస్తారు.

అష్టమి, నవమి లేదు..

ఈనెల 8 నుంచి 11 వరకు నామినేషన్లు వేయడానికి ఎన్నికల అధికారులు సమయం ఇచ్చారు. నామినేషన్లు వేసే మూడు రోజుల్లో అష్టమి, నవమి లేకపోవడం అభ్యర్థులకు సెంటిమెంట్‌గా కలిసి వచ్చే అంశం. గురువారం, శనివారం దివ్యమైన రోజులుకాగా, శుక్రవారం చవితి ఉంది. కాబట్టి గురువారం, శనివారం ఎక్కువగా నామినేషన్లు వేసే అవకాశం ఉంది. కాగా బీసీ రిజర్వేషన్లపై గురువారం హైకోర్టు ఇచ్చే తీర్పు ఆధారంగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

ఇప్పటికే అభ్యర్థుల ఖరారు

పార్టీ గుర్తులపై జరిగే ఎన్నికలు కావడంతో అభ్యర్థుల ఎంపికపై ఆయా పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. తొలి విడతలో జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను ప్రధాన పార్టీలు దాదాపు ఖరారు చేశాయి. మూడు రోజుల సమయం ఉన్నందున నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ పార్టీలు తమ అభ్యర్థులను రంగంలోకి దించబోతున్నాయి.

ఎన్నికలు జరిగే స్థానాలు

జెడ్పీటీసీలు	ఎంపీటీసీలు
ఆలేరు	గొలనుకొండ,కొలనుపాక-1, కొలనుపాక-2, కొల్లూరు, రాఘవాపురం, శారాజీపేట, టంగుటూరు.
రాజాపేట	బేగంపేట, బొందుగుల, చల్లూరు, దూదివెంకటాపూర్, నెమిల, పాముకుంట, పారుపల్లి, రఘునాథపురం, రాజాపేట, రేణికుంట, సింగారం.
యాదగిరిగుట్ట	చిన్నకందుకూరు, చొల్లేరు, దత్తాయపల్లి, గౌరాయపల్లి, మల్లాపూర్, మాసాయిపేట, పెద్దకందుకూరు, సాదువెల్లి, వంగపల్లి.
మోటకొండూరు	అమ్మనబోలు, చాడ, చందేపల్లి, కాటేపల్లి, మాటూరు, మోటకొండూరు-1, మోటకొండూరు-2.
అడ్డగూడూరు	అడ్డగూడూరు, చౌళ్లరామారం, డి.రేపాక, గట్టుసింగారం, జానకిపురం, కోటమర్తి, వెల్దేవి.
మోత్కూరు	దాచారం, దత్తప్పగూడెం, ముషిపట్ల, పాటిమట్ల, పొడిచేడు.
బొమ్మలరామారం	బొమ్మలరామారం, చీకటిమామిడి, చౌదర్పపల్లి, గోవిందుతండా, జలాల్‌పూర్, మర్యాల, మేడిపల్లి, నాగినేనిపల్లి, ప్యారారం, రామలింగంపల్లి, తిమ్మాపూర్.
తుర్కపల్లి	దత్తాయపల్లి, ధర్మారం, గంధమల్ల, మాధాపూర్, ముల్కలపల్లి, నాగాయపల్లి, రుస్తాపూర్, తుర్కపల్లి, వాసాలమర్రి, వీరారెడ్డిపల్లి.
ఆత్మకూర్(ఎం)	ఆత్మకూర్(ఎం), కప్రాయపల్లి, కొరటికల్, కూరెల్ల, పల్లెర్ల, పారుపల్లి, రహీంఖాన్‌పేట, సింగారం.
గుండాల	అంబాల, అనంతారం, గుండాల, మరిపడిగ, పెద్దపడిశాల, సీతారాంపూర్, సుద్దాల, వస్తాకొండూరు, వెల్మజాల.

నోటిఫికేషన్ జారీకి సిద్ధంగా ఉన్నాం : కలెక్టర్ హనుమంతరావు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మొదటి విడత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్ జారీకి సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హనుమంతరావు తెలిపారు. బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారులతో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల ప్రక్రియపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హాజరై మాట్లాడారు. జిల్లాకు సంబంధించి మొదటి విడతలో 10 జెడ్పీటీసీలు, 84 ఎంపీటీసీ స్థానాల ఎన్నికల గురువారం నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఇప్పటికే ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక బృందాలను నియమించామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, డీసీపీ, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు

జీపీఓలు పారదర్శకంగా పనిచేయాలి
- కలెక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి : గ్రామపాలన అధికారులు (జీపీఓలు) రెవెన్యూ వ్యవస్థ పటిష్టతకు పారదర్శకంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. కొత్తగా నియామకమైన గ్రామ పాలన అధికారులకు బుధవారం భువనగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. మీపై నమ్మకంతో పరిపాలన అధికారులుగా తిరిగి పోస్టింగ్ ఇచ్చామన్నారు. ప్రజలకు అన్ని సర్వీసులు అందించేది రెవెన్యూ శాఖ మాత్రమే అన్నారు. భూభారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ గ్రామ పరిపాలన అధికారులు తమ విధులు బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. గ్రామ రెవెన్యూ రికార్డులు, లెక్కలను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వ భూములు, ఇతర ఆస్తులను అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ జయమ్మ, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృతిక, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్మోహన్ ప్రసాద్, జీపీఓలు పాల్గొన్నారు.

యాసంగి సన్నాలకు అందని బోనస్
- ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయి రూ.64.58 లక్షలు
- సన్నధాన్యం అమ్మిన రైతులు 367 మంది
- కేంద్రాల్లో కొనుగోలు చేసింది 1,291.680 మెట్రిక్ టన్నులు
- నాలుగు నెలలు దాటినా విడుదలకాని సొమ్ము
- వానాకాలం పంట కూడా చేతికొచ్చిందని రైతుల ఆవేదన



రామన్నపేట: గత యాసంగి సీజన్‌కు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వం అందించాల్సిన బోనస్ డబ్బులు నేటికీ విడుదల చేయలేదు. ప్రభుత్వం ఎన్నికల ముందు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. 2024-25 వానాకాలం సీజన్‌కు సంబంధించి సన్నధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బోనస్ డబ్బులు చెల్లించింది. అయితే గత యాసంగికి సంబంధించిన బోనస్ డబ్బులు ఇప్పటికీ ఇవ్వకపోవడంతో వాటి కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

2,75,315 ఎకరాల్లో వరి సాగు

గత యాసంగిలో 2,75,315 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.849.32కోట్ల విలువైన 3,67,479మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తుందనే ఆశతో యాసంగిలో దిగుబడి తక్కువ వస్తుందని తెలిసికూడా జిల్లాలో 367 మంది రైతులు సన్నరకం వరి సాగు చేశారు. ప్రభుత్వం రైతుల నుంచి 1,291.680 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మిగిలిన ధాన్యంతోపాటు సన్నధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.2,320 మద్దతు ధరను చెల్లించింది. క్వింటాకు రూ.500 లెక్కన బోనస్ డబ్బులు రూ.64,58,400 పెండింగ్‌లో ఉంచింది. ధాన్యం విక్రయించి నాలుగు నెలలు దాటినా ప్రభుత్వం బోనస్ డబ్బులు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వారం, పది రోజుల్లో వానాకాలం సీజన్ కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వం స్పందించి బోనస్ డబ్బులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

రూ.19వేల బోనస్ రావాల్సి ఉంది



యాసంగిలో రెండు ఎకరాల్లో సన్నరకం ధాన్యం సాగు చేశాం. బోనస్ వస్తుందనే ఆశతో దొడ్డు రకం కాకుండా సన్నరకమే వేశాం. 38.4క్వింటాళ్ల దిగుబడి రాగా రామన్నపేటలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాం. సుమారు రూ.19వేల బోనస్ డబ్బులు రావాల్సి ఉంది.

- చిల్ల లక్ష్మి, కక్కిరేణి, రామన్నపేట మండలం

తొలగించకుంటే ముప్పే!

ఆలేరు పెద్దవాగుపై శిథిలావస్థలో వందేళ్ల నాటి వంతెన
- బ్రిడ్జి కిందిభాగంలో పెచ్చులూడి తేలిన చువ్వలు
- ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి
- హైదరాబాద్-వరంగల్ మధ్య రాకపోకలకు ఇదే ప్రధాన వారధి
- ఆందోళనలో వాహనదారులు



ఆలేరు పెద్దవాగుపై వంతెనకు కింది భాగంలో పెచ్చులూడి తేలిన ఇనుప చువ్వలు

ఆలేరు: ఆలేరు నియోజకవర్గ కేంద్రంలోని పెద్దవాగుపై నిర్మించిన పురాతన వంతెన పెచ్చులూడుతూ శిథిలావస్థకు చేరింది. నేషనల్ హైవే అథారిటీ పరిధిలో ఉన్న ఈ వంతెన పునర్నిర్మాణంపై నేటికీ చిక్కుముడి వీడడం లేదు. ఇక తమ పరిధిలో లేదనే సాకుతో రోడ్లు, భవనాల శాఖ అధికారులూ పట్టించుకోని పరిస్థితి. హైదరాబాద్-వరంగల్ నగరాల మధ్య రాకపోకలకు ప్రధాన మార్గమైన పెద్దవాగుపై ఉన్న ఈ వంతెన విషయంలో పాలకుల ఉదాసీనతతో ఏళ్లుగా పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. దాదాపు వందేళ్ల క్రితం నిజాం కాలంలో పెద్దవాగుపై నిర్మించిన ఈ పురాతన వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఈ పురాతన వంతెనను తొలగించి కొత్తది నిర్మించకపోతే పెద్ద ముప్పే పొంచి ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ఎన్‌హెచ్‌ఏ, ఆర్‌అండ్‌బీ ఎవరికి వారే..

2009 సంవత్సరానికి కాస్తా అటు ఇటుగా ఆలేరుకు రెండో విడతలో బైపాస్ రోడ్డు మంజూరైంది. ఆలేరు శివారులోని సాయిబాబా దేవాలయం నుంచి పట్టణం, పెద్దవాగు వంతెన మీదుగా స్థానిక ఎంపీడీఓ, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు బైపాస్ ప్రాజెక్టు పనులపై నేషనల్ హై అథారిటీస్ అప్పట్లో ప్రతిపాదనలు చేసింది. ఆలేరు కోర్టు భవనం సమీపంలో జరిగిన సమావేశంలో పట్టణం మీదుగా బైపాస్ పనులు చేపడితే వ్యాపార సముదాయాలు, పలు గృహాలు కోల్పోవాల్సి వస్తుందని కొందరు వ్యాపారులు ఈ ప్రతిపాదనలను తిరస్కరించారు. దాంతో నేషనల్ హైవే అథారిటీ అధికారులు బైపాస్ అలైన్‌మెంట్‌ను పట్టణం మీదుగా కాకుండా వేరే మార్గంలో మార్చారు. తర్వాత వ్యాపారులు తమ నిర్ణయాన్ని మార్చుకొని, పట్టణం మీదుగా బైపాస్ పనులకు సుముఖత చూపారు. ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడగా అలైన్‌మెంట్ ప్రతిపాదనలు ఫైనల్ అయ్యాయని, మళ్లీ మార్చడానికి వీలుకాదని సమాధానం ఇచ్చారు. దీంతో అప్పటి నుంచి మొదట చేసిన ప్రతిపాదిత అలైన్‌మెంట్ ప్రకారం వంతెన మార్గం తదితర ప్రాంతాలు ఎన్‌హెచ్ పరిధిలో ఉండిపోయాయి. దాంతో పునర్నిర్మాణానికి లేదా కనీసం మరమ్మతులకు వంతెన నోచుకోడం లేదు. ఎన్‌హెచ్‌ఏ, ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం శిథిలవుతున్న వంతెన విషయమై అడిగితే ఎవరికి వారు తమ పరిధిలోనిది కాదని అంటున్నారు.

వందలాదిగా వాహనాల రాకపోకలు

ఆలేరు నుంచి జనగాం, పెంబర్తి గుండాల, మోత్కూరు, జీడికల్, అనంతారం తదితర ప్రాంతాలకు వాహనాల రాకపోకలకు పెద్దవాగుపై ఈ వంతెనే ప్రధాన వారధి. ఈ వంతెన దాదాపు 400 మీటర్ల పొడవు ఉంటుంది. చిన్నచిన్న గ్రామాలకు వెళ్లాలన్నా ఈ వంతెన మీదుగానే ప్రయాణించాలి. ఆర్టీసీ బస్సులతోపాటు రోజు వందలాది వాహనదారులు ఈ వంతెన మీదుగా ఆయా గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

ఇనుప చువ్వలు తేలి ప్రమాదకరంగా..

వాగు నుంచి అడ్డగోలుగా ఇసుక తరలించకపోవడంతో వంతెన పునాది భాగంలో నేల కుంగిపోతోంది. భారీ వాహనాలు లోడ్‌తో వెళ్లినప్పుడు వంతెన కిందభాగం పెచ్చులూడుతూ ఇనుప చువ్వలు తేలాయి. పిల్లర్లకు పగుళ్లు వచ్చాయి. వంతెనకు ఇరువైపులా రక్షణ దిమ్మెలు సరిగా లేవు. ద్విచక్ర వాహనదారులు వంతెనపై పలు సందర్భాల్లో ప్రమాదానికి గురైనప్పుడు వాగులో పడిపోయిన సంఘటనలూ ఉన్నాయి.

వంతెనను పునర్నిర్మించాలి



ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన పెద్దవాగుపై వంతెనను పునర్నిర్మించాలి. శిథిలమైన ఈ వంతెనపై ప్రయాణం ప్రమాదకరమే. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- పత్తి రాములు, ఆలేరు

ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తేవాలి



ఆలేరు పెద్దవాగు వంతెన ఎన్‌హెచ్‌ఏ పరిధిల్లోంచి ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకురావాలి. అప్పటి అవసరాల మేరకు నిర్మించిన వంతెన ఇప్పుడు ఇరుకుగా మారింది. ప్రమాదాలు జరుగుతున్నాయి. కొత్త వంతెన నిర్మించాలి.

- సృజన్‌కుమార్, ఆలేరు

మా పరిధిలో లేదు

ఆలేరు పెద్దవాగుపై నిర్మించిన వంతెన మా పరిధిలో లేదు. ఎన్‌హెచ్‌ఏ పరిధిలో ఉంది. పునర్నిర్మాణం, మరమ్మతులు చేయాలన్నా ఎన్‌హెచ్‌ఏ అధికారుల ఆధ్వర్యంలో చేయాల్సి ఉంటుంది.

- కరుణాకర్ ఆర్‌అండ్‌బీ ఏఈ ఆలేరు



ఆలేరు పెద్దవాగుపై శిథిలావస్థకు చేరిన వందేళ్ల నాటి వంతెన

చేనేత రుణమాఫీ ఏమాయే..!

- రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తామని 13 నెలల క్రితం ప్రకటించిన ప్రభుత్వం
- నాలుగు నెలల కిత్రం జీఓ జారీ
- నేటికీ అమలుకు నోచుకోని పథకం
- ఇబ్బందుల్లో చేనేత కార్మికులు





ఈ ఫొటోలోని వ్యక్తి పోచంపల్లికి చెందిన చేనేత కార్మికుడు గుండు ప్రవీణ్. రెండేళ్ల క్రితం స్థానిక కెనరా బ్యాంకు నుంచి రూ.2లక్షల రుణం తీసుకున్నాడు. నెలానెలా కిస్తీలు చెల్లిస్తూ వస్తుండగా.. చివరగా రూ.1.23లక్షలు బకాయి పడ్డాడు. రూ.లక్ష లోపు చేనేత రుణాలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో బంగారం అమ్మి పై రూ.23,500 బ్యాంకులో చెల్లించాడు. కానీ ఇప్పటివరకు మిగతా రూ.లక్ష, రుణమాఫీ కాలేదు. దీంతో మూడు నెలల వడ్డీ కింద అతని ఖాతా నుంచి రూ.3వేలు కట్ చేశారు.

భూదాన్‌పోచంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించి 13 నెలలవుతున్నా నేటికీ అమలుకు నోచుకోక వడ్డీ భారం పెరుగుతుందని నేతన్నలు వాపోతున్నారు.

రుణమాఫీకి జీఓ జారీ చేసినా..

రుణమాఫీ చేస్తామని గతేడాది సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జాతీయ చేనేత సాంకేతిక సంస్థ(ఎస్ఐహెచ్‌టీ) ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. విధివిధానాలు ఖరారు చేయడం, ఎన్నికల కోడ్ కారణాల వల్ల జాప్యం జరిగింది. ఏడు నెలల క్రితం అసలు, వడ్డీ కలుపుకుని రూ.లక్ష లోపు ఉన్న వ్యక్తిగత చేనేత రుణాలను మాఫీ చేస్తూ జీఓ నంబర్ 56ను జారీ చేసింది. 2025–26 బడ్జెట్ నుంచి రూ.33 కోట్లు మంజూరు చేస్తూ నాలుగు నెలల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్ అపెరల్ ఎక్స్‌పోర్ట్ పార్కుల కమిషనర్‌కు ఈ నిధులను విడుదల చేసి లబ్ధిదారులకు చెల్లించేందుకు అధికారాలు ఇచ్చారు.

నేటికీ ఆమోదించని రాష్ట్ర కమిటీ

రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించకపోవడంతో రుణమాఫీ అమలులో తీవ్ర జాప్యం జరుగుతున్నట్టు తెలుస్తోంది. ఆయా జిల్లాల పరిధిలో చేనేత కార్మికులు తీసుకున్న రుణాల వివరాలను చేనేత, జౌళి శాఖ ఏడీలు బ్యాంకుల వారీగా జాబితాను తయారు చేసి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలో సభ్యులుగా ఉన్న డీసీసీబీ సీఈఓ, చేనేత శాఖ ఆర్‌డీడీ, లీడ్‌బ్యాంకు మేనేజర్, నాబార్డు డీజీఎం, పరిశ్రమల శాఖ జీఎం, జిల్లా సహకార అధికారులు ఆమోదించారు. అనంతరం ఆగస్టులో రుణమాఫీ అర్హుల జాబితాను రాష్ట్ర స్థాయి కమిటీకి పంపించారు. కొన్ని జిల్లాల నుంచి జాబితాలు రాష్ట్రస్థాయి కమిటీకి అందని కారణంగా రుణమాఫీ అమలులో జాప్యం జరుగుతోందని తెలిసింది.

అప్పు చేసి చెల్లించి..

రూ.లక్షపైన రుణాలు తీసుకున్న వారు ఆ పై మొత్తాన్ని జూలై నెలాఖరులోగా చెల్లిస్తే వారందరికీ రుణమాఫీ వర్తిస్తుందని అధికారులు చెప్పడంతో చాలా మంది అప్పులు చేసి, బంగారం కుదవపెట్టి రుణాలు చెల్లించారు. రుణమాఫీ అమలు కాక కార్మికుల ఖాతాల్లోంచి మూడు నెలల వడ్డీ కట్ చేసుకున్నారు. మరోవైపు బయట తీసుకున్న అప్పులకు వడ్డీ చెల్లిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో..

2017 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు చేనేత కార్మికులు తీసుకున్న రుణాలను మాఫీ చేయనుంది. యాదాద్రి జిల్లాలో వివిధ బ్యాంకుల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న 2,380 మంది చేనేత కార్మికులకు రూ.19.25 కోట్ల రుణమాఫీ జరుగనుంది. అలాగే నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో కలిపి 423 మంది చేనేత కార్మికులకు రూ.4కోట్ల రుణమాఫీ లబ్ధి చేకూరనుంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,803 మందికి రూ.23.25 కోట్ల మేర రుణమాఫీ కానుంది.

రూ.75 వేలు బకాయి ఉంది



2015లో స్థానిక కెనరా బ్యాంకు నుంచి రూ.50 వేలు లోన్ తీసుకున్నాను. అసలు, వడ్డీ కలుపుకుని మొత్తం రూ.75వేలు బకాయి ఉంది. ఇంకా చేనేత రుణమాఫీ కాలేదు. వెంటనే నేత కార్మికులకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలి.

– మిర్యాల వెంకటేశం, చేనేత కార్మికుడు, భూదాన్‌పోచంపల్లి

తక్షణమే రుణమాఫీ చేయాలి



ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి ఏడాది గడిచిపోయింది. తక్షణమే చేనేత రుణమాఫీ చేయాలి. చేనేత రుణమాఫీ, నేతన్న భరోసా, చేనేతపై జీరో జీఎస్టీ తదితర సమస్యలపై చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం పోచంపల్లిలో అఖిలపక్షాలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నాం.

– కర్నాటి పురుషోత్తం, చేనేత జన సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు

ఆదేశాలు రాలేదు..



చేనేత కార్మికుల రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న 2,380 మంది చేనేత కార్మికుల జాబితాను ఆగస్టులోనే రాష్ట్రస్థాయి కమిటీకి పంపించాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం.

– శ్రీనివాసరావు, యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత, జౌళి శాఖ ఏడీ

క్లుప్తంగా

కుమార్తెతో కలిసి మహిళ అదృశ్యం

మిర్యాలగూడ అర్బన్: ఏడాది వయస్సున్న కుమార్తెతో కలిసి మహిళ అదృశ్యమైంది. మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో లావూరి వెన్నెల తన భర్త వినోద్‌తో కలిసి నివాసముంటోంది. వీరికి ఏడాది వయస్సున్న పాప ఉంది. ఈ నెల 4న వినోద్ పని నిమిత్తం వేరే ఊరికెళ్లగా.. అదే రోజు ఉదయం 9గంటల సమయంలో వెన్నెల తన కుమార్తెతో కలిసి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వినోద్ ఎంత వెతికినా వెన్నెల ఆచూకీ లభించకపోవడంతో బుధవారం మిర్యాలగూడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 95021 52452 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

సాగర్ ఎడమ కాలువలో వ్యక్తి గల్లంతు



బాబునాయిక్

మునగాల: అయ్యప్ప మాల ధరించిన వ్యక్తి సాగర్ ఎడమ కాలువలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో గల్లంతయ్యాడు. ఈ ఘటన మునగాల మండలం కృష్ణానగర్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్ గ్రామానికి చెందిన బుక్యా బాబునాయిక్(42) బుధవారం అయ్యప్ప మాల స్వీకరించాడు. సాయంత్రం స్నానం చేసేందుకు గ్రామ శివారులోని సాగర్ ఎడమ కాలువకు మరికొందరు అయ్యప్ప మాలధారులతో కలిసి వెళ్లాడు. స్నానం చేసే క్రమంలో బాబునాయిక్ ప్రమాదవశాత్తు జారి ఎడమ కాలువలో మునిగిపోయాడు. అతడికి ఈత వచ్చినప్పటికీ వరద తాకిడికి కొట్టుకుపోయాడు. బాబునాయిక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. అయ్యప్ప మాలధారులు, బాబునాయిక్ కుటుంబ సభ్యులు నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- ఐదు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

మఠంపల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. ఈ ఘటన మఠంపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండల కేంద్రంలో నివాసముంటున్న ఆదూరి మర్రెడ్డి అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం హైదరాబాద్‌లో వెళ్లాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అతడి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి ఐదు తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. చోరీ జరిగిన విషయం బంధువుల ద్వారా తెలుసుకున్న మర్రెడ్డి బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్‌టీంను పిలిపించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి. బాబు తెలిపారు.

సైనిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



కరుణాకర్ (ఫైల్)

బొమ్మలరామారం: బొమ్మలరామారం మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ కోమరాజు కరుణాకర్(27) అంత్యక్రియలు బుధవారం స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో జరిగాయి. రాజస్తాన్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న కరుణాకర్ దసరా పండుగకు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో ఈ నెల 6న పగిడిపల్లి–భువనగిరి రైలు మార్గంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం నిర్వహించిన కరుణాకర్ అంత్యక్రియలకు సైనికాధికారులు హాజరై గౌరవ సూచికంగా గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం జాతీయ పతాకాన్ని కరుణాకర్ తల్లి లక్ష్మికి అందజేశారు. కరుణాకర్ తండ్రి వెంకటేష్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తూ 28ఏళ్ల క్రితమే మృతిచెందాడు. అనంతరం కరుణాకర్ తల్లి లక్ష్మి స్వీపర్‌గా పనిచేస్తూ ఏకైక కుమారుడిని కష్టపడి చదివించింది. కరుణాకర్‌కు కొంత కాలం క్రితం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం ప్రతాపసింగారం గ్రామానికి చెందిన లతతో వివాహం అయ్యింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.



కరుణాకర్ తల్లి లక్ష్మికి జాతీయ పతాకం అందజేస్తున్న ఆర్మీ అధికారి

హత్యాచారం కేసులో ఇద్దరికి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి

రామగిరి(నల్లగొండ): ఇంటర్ విద్యార్థినిపై హత్యాచారం కేసులో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. బుధవారం నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం జీకే అన్నారం గ్రామానికి చెందిన గడ్డం కృష్ణ(21) ప్రేమ పేరుతో ఇంటర్ చదువుతున్న విద్యార్థినితో పరిచయం పెంచుకున్నాడు. గత మూడు నెలలుగా ఇన్‌స్ట్రాగాం ద్వారా ఆమెతో చాటింగ్ చేశాడు. సదరు విద్యార్థిని మంగళవారం ఇంటి నుంచి కాలేజీకి బయల్దేరి నల్లగొండకు వచ్చింది. నల్లగొండ పట్టణంలోని డీఈఓ కార్యాలయం వద్ద వేచి చూస్తున్న విద్యార్థిని వద్దకు గడ్డం కృష్ణ బైక్‌పై వచ్చి ఆమెను తన స్నేహితుడైన నల్లగొండ మండలం రసూల్‌పుర గ్రామానికి చెందిన బచ్చలకూరి మధు(19) రూమ్‌కి తీసుకెళ్లాడు. కృష్ణ, ఆ విద్యార్థిని రూమ్‌లో ఉండగా.. మధు బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో కృష్ణ విద్యార్థినిపై అత్యాచారం చేశాడు. దీంతో బాలికకు తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతిచెందింది. వెంటనే కృష్ణ రూమ్‌కి తాళం వేసి అక్కడ నుంచి పారిపోయాడు. ఈ విషయాన్ని తనకు తెలిసిన వ్యక్తుల ద్వారా కృష్ణ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అదే రోజు సాయంత్రం నల్లగొండ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కృష్ణ లొంగిపోయాడు. కృష్ణ ఇచ్చిన సమాచారం ఆధారంగా అతడి స్నేహితుడు మధును కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని వారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి.. డాక్టర్లు ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కృష్ణ, మధుపై పోలీసులు అత్యాచారం, హత్య, పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ విధించి కోర్టులో హాజరుపరిచారు. విలేకరుల సమావేశంలో టూటౌన్ సీఐ రాఘవరావు, వన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదులు, సైదాబాబు పాల్గొన్నారు.

చంపుతామని బెదిరించిన ఐదుగురి అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్

సూర్యాపేటటౌన్ : పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని చంపుతామని బెదిరింపులకు పాల్పడిన ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన సూర్యాపేట మండల పరిధిలోని యర్కారం గ్రామానికి చెందిన బొర్ర సైదమ్మ తన ఇంటి ముందు నిలబడి ఉండగా.. అదే గ్రామానికి చెందిన గుండ్లపల్లి నవీన్, గుండ్లపల్లి సాయికుమార్, చందుపట్ల సందీప్‌కుమార్, బొర్ర అభిషేక్, పిల్లలమర్రి గ్రామానికి చెందిన చెరుకుపల్లి అర్జున్ కారులో ఆమె వద్దకు వచ్చారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని నవీన్‌తో పాటు మిగతా వారు కారులో నుంచి తల్వార్ తిప్పుకుంటూ బయటకు దిగి సైదమ్మతో పాటు ఆమె కుమారుడు, మారపల్లి సతీష్, మోదాల నాగయ్యను బూతులు తిడుతూ చంపుతామని బెదిరించారు. దీంతో బాధితురాలు సైదమ్మ సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో తనను బెదిరించిన వారిపై ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి కారుతో పాటు తల్వార్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఐ బాలునాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరిట మోసం చేశారు



కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రజలకు అందజేస్తున్న చిరుమర్తి లింగయ్య

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్: ఆరు గ్యారంటీల పేరిట తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయని హామీలతో కూడిన బాకీ కార్డులను బుధవారం నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో ప్రజలకు ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ మర్చిపోయిన హామీలను గుర్తుచేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజల వద్దకు బాకీ కార్డులను తీసుకొచ్చిందన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, నాయకులు సోమయాదగిరి, గుర్రం గణేష్, రాచకొండ వెంకన్నగౌడ్, గోర్ల వీరయ్య, రావిరాల మల్లయ్య, సామ శ్రీనివాస్‌రెడ్డి, దైద పరమేషం, యానాల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాలియా ఎస్‌బీఐ శాఖలో అగ్ని ప్రమాదం

- షార్ట్ సర్క్యూట్‌తో ఫర్నీచర్, కంప్యూటర్లు, ఏసీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధం



హాలియా ఎస్‌బీఐ శాఖలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హాలియా: హాలియా పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంగళవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి బ్యాంకులో ఉన్న అలారం మోగింది. దీంతో వాచ్‌మెన్ గమనించి బ్యాంకు అధికారులకు సమాచారం అందించారు. స్థానికులు ఫైర్ స్టేషన్‌కు, పోలీస్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక ఎస్ఐ సాయిప్రశాంత్ తమ సిబ్బందితో బ్యాంకు వద్దకు చేరుకొని మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈ ప్రమాదంలో బ్యాంకులోని కంప్యూటర్లు, ఏసీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఫర్నీచర్ కాలిబూడిదయ్యాయి. బ్యాంకు మేనేజర్ మోహన్‌ని వివరణ కోరగా.. షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగినట్లు గుర్తించామని, ఈ ఘటనపై ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యమైన డాక్యుమెంట్లకు ఏమీ కాలేదని, ఒక కంప్యూటర్, రెండు ఏసీలు, కొంత ఫర్నీచర్ మాత్రం కాలిపోయిందని తెలిపారు.

ప్రమాదంపై ఆరా..

బ్యాంకులో జరిగిన ప్రమాదానికి గల కారణాలు, నష్టం వివరాలు, బ్యాంకులో తాకట్టు పెట్టిన షూరిటీ పత్రాలు, బంగారం, నగదు తదితర వివరాలపై ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ప్రమాద వివరాలను తెలుసుకునేందుకు ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం అధికారులు రానున్నట్లు తెలిసింది. ఎస్ఐ సాయి ప్రశాంత్, అగ్నిమాపక అధికారులు బ్యాంకు అధికారులను అడిగి నష్టం వివరాలను తెలుసుకున్నారు.

అధిక వడ్డీ బాధితుడు మృతి



సరియా (ఫైల్)

పెద్దఅడిశర్లపల్లి: అధిక వడ్డీ ఆశ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. పెద్దఅడిశర్లపల్లి మండలం వద్దిపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పలుగుతండాకు చెందిన రమావత్ సరియా(37) 20ఏళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం కుటుంబంతో కలిసి మిర్యాలగూడకు వలస వెళ్లాడు. ఈ క్రమంలో తాను సంపాదించిన డబ్బుతో పాటు తన బంధువుల వద్ద అప్పుగా తీసుకున్న సుమారు రూ.కోటి పలుగుతండాకు చెందిన బాలాజీకి అధిక వడ్డీకి అప్పు ఇచ్చాడు. ఇటీవలి కాలంలో బాలాజీ డబ్బులు ఇవ్వడంలేదని తెలుసుకున్న బంధువులు తమ డబ్బులు తమకు ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో సరియా గత మూడు నెలలుగా బాలాజీ చుట్టూ తిరుగుతున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో బంధువుల వద్ద మాట పోతుందని మనస్తాపానికి గురై సోమవారం మిర్యాలగూడలోని తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి స్థానిక ఆస్పత్రిలో తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సరియా మృతితో పలుగుతండాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవరకొండ ఏఎస్పీ మౌనిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వడ్డీ వ్యాపారి సోదరి ఇంటి వద్ద బాధితుల ఆందోళన



బాలాజీనాయక్ సోదరి ఇంటి వద్ద బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

నేరేడుచర్ల : అధిక వడ్డీ ఆశ చూపి కోట్లాది రూపాయలు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేసిన రమావత్ బాలాజీనాయక్ సోదరి నేరేడుచర్లలో నివాసం ఉంటున్న విషయాన్ని తెలుసుకున్న బాధితులు బుధవారం ఆమె నివాసం వద్ద ఆందోళనకు దిగారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పలుగుతండాకు చెందిన వడ్డీ వ్యాపారీ రమావత్ బాలాజీనాయక్ రూ.10 నుంచి రూ.16 వడ్డీ ఆశ చూపి కోట్లాది రూపాయలు వసూలు చేసి తిరిగి చెల్లించలేదు. ఆ నగదుతో తన సోదరి పేరుతో నేరేడుచర్లలో ఇల్లు కొనుగోలు చేశాడని తెలుసుకున్న బాధితులు ఆమె ఇంటిపై దాడికి యత్నించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఆస్తులను ధ్వంసం చేయడం సరైంది కాదని చెప్పి బాధితులను తిరిగి పంపించారు.

నల్లగొండ ఉర్సుకు వేళాయే..

- మూడు రోజులపాటు ఉత్సవాలు
- నేడు గంధం ఊరేగింపు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ జిల్లా కేంద్రంలోని హజరత్ సయ్యద్ షా లతీఫ్ ఉల్లా ఖాద్రి దర్గా ఉర్సు నేటి నుంచి ప్రారంభం కానుంది. కులమతాలకు అతీతంగా ప్రజలు ఈ ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉర్సు సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం స్థానిక మదీనా మసీదు నుంచి గంధం ఊరేగింపుతో ఉర్సు ప్రారంభమవుతుంది. 10న దీపాలంకరణ, 11న ఖవ్వాలిలో ఉర్సు ముగుస్తుంది. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతోపాటు హైదరాబాద్ నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

ఆఫ్రికా నత్తల నివారణ ఇలా..



పిట్టలగూడెంలో ఆఫ్రికా నత్తలను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారి, శాస్త్రవేత్తల బృందం



బీరకాయను తినేస్తున్న ఆఫ్రికా నత్త

- ఉద్యానవన అధికారులు, శాస్త్రవేత్తల సూచన

గుర్రంపోడు : గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం గ్రామంలో ఉద్యానవన అధికారుల, శాస్త్రవేత్తల బృందం బుధవారం ఉద్యానవన పంటలను పరిశీలించి తోటలకు హాని కల్గిస్తున్న నత్తలను ఆఫ్రికా నత్తలుగా గుర్తించారు. జిల్లా ఉద్యానవన శాఖాధికారి కె.సుబాషిణి, మల్లేపల్లి ఉద్యాన పరిశోధనాకేంద్రం శాస్త్రవేత్త రాజాగౌడ్ ప్రాంతీయ ఉద్యానవనశాఖాధికారి కె.మురళితో కూడిన బృందం ఆఫ్రికా నత్తల ప్రభావాన్ని పరిశీలించి తగు నివారణ చర్యలను సూచించింది. ఆఫ్రికా నత్తలు వందేళ్ల క్రితమే భారతదేశానికి వలస వచ్చాయని, మూడేళ్లుగా తెలుగు రాష్ట్రాల తోపాటు కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో విజృంభిస్తున్నాయని అన్నారు. కేరళ, తమిళనాడు , కర్ణాటక రాష్ట్రాల నుంచి శ్రీగంధం, ఎర్రచందనం చెట్లను దిగుమతి చేసుకోవడం వల్ల ఈ ప్రాంతానికి ఆఫ్రికా నత్తలు వచ్చాయని గమనించామని తెలిపారు. ఆఫ్రికా నత్తలు జులై నుంచి ఫిబ్రవరి వరకు గుడ్లను ఒక్కో నత్త 400 గుడ్లు పెట్టి తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయని అన్నారు. ఒక్కో ఆఫ్రికా నత్త తమ జీవితకాలమైన ఐదేళ్లలో 1200 వరకు పిల్లలకు జన్మనిస్తుందని అన్నారు. బొప్పాయి, అరటి, జామ, ఆయిల్ పామ్ తదితర పండ్లతోటల తోపాటు కూరగాయల పంటలను నాశనం చేస్తాయన్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

ఆఫ్రికా నత్తల నివారణకు ఒక కిలో ఉప్పును నాలుగు లీటర్ల నీటిలో కలిపి ఆ నీటిలో గోనె సంచిని తడిపి గట్లపై వేస్తే ఈ నంచులపైకి వెళ్లిన నత్తలు ద్రావణం ఘాటుకు చనిపోతాయని తెలిపారు. ఆకర్షణ ఎర ఏర్పాటులో భాగంగా 10 కిలోల వరి తవుడుకు, ఒక కిలో బెల్లం , ఒక లీటరు ఆముదం మరియు ఒక కిలో థయోడికార్బ్ గుళికలు లేదా ఎసిఫేట్ లేదా క్లోరోఫైరిఫాస్ కలిపి చిన్న ఉండలుగా చేసి ఈ ఉండలను బొప్పాయి, క్యాబేజీ ఆకుల కింద ఉంచితే ఆఫ్రికా నత్తలు తిని చనిపోతాయని శాస్త్రవేత్తలు చెప్పారు. అనంతరం వీటిని ఉప్పు ద్రావణంలో వేయాలని, వారానికి రెండు, మూడు రోజుల పాటు 15 రోజుల వరకు ఇలా చేయాలని సూచించారు. నత్తలు ఏరివేసే సమయంలో చేతికి గ్లౌజులు తప్పనిసరి ధరించాలన్నారు. 2 గ్రాముల కాపర్ సల్ఫేట్, 2 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్ ఒక లీటరు నీటిలో కలిపి చెట్లపై పిచికారీ చేస్తే 70 శాతం నత్తలు కింత పడిపోతాయని, వీటిని ఏరి కాల్చి వేయలన్నారు. 2 గ్రాముల మెటల్డిహైడ్ 2.5 గుళికలు భూమి పైన మరియు చెట్ల మొదళ్లలో ఎరగా చల్లాలని అన్నారు. పండ్లతోటల్లో కలుపు, చెత్త లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని , మొక్కలను ఒత్తుగా దగ్గరగా వేసుకోకూడదని, రాత్రిళ్లు నీరు పారించవద్దని చెప్పారు. తోటల్లో కోళ్లు, బాతులు పెంచుకోవాలని సూచించారు.

ఒకే రోజు గుండెపోటుతో ముగ్గురు నాయకులు మృతి

- కోదాడ నియోజకవర్గంలో విషాదం



భాగ్యరాజ్ (ఫైల్)



అంతయ్య (ఫైల్)



సురేష్‌బాబు(ఫైల్)

కోదాడ రూరల్ : కోదాడ నియోజకవర్గంలో ఒకే రోజు ముగ్గురు రాజకీయ నాయకుల గుండెపోటు మరణాలు ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. కోదాడ పట్టణానికి చెందిన యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఆళ్ల భాగ్యరాజ్(34) మంగళవారం జ్వరం బారినపడి ట్యాబ్లెట్‌లు వేసుకున్నాడు. రాత్రి పడుకున్న తర్వాత బుధవారం తెల్లవారుజామున భార్య లేపగా ఎలాంటి కదలికలు లేకుండా ఉన్నాడు. వైద్యుడిని పిలిపించి చూడగా గుండెపోటుతో మృతిచెందినట్లు నిర్ధారించారు. అదేవిధంగా నడిగూడెం మండలం బృందావనపురానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మండవ అంతయ్య(81) బుధవారం ఉదయం పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో వేణుగోపాలపురం వెళ్లాడు. అక్కడ ఓ నాయకుడి ఇంటి వద్ద స్థానిక సంస్థల అభ్యర్థిత్వంపై చర్చిస్తుండగా ఒక్కసారి కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు, కోదాడకు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. చిలుకూరు మండల మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకుడు దొడ్డా సురేష్‌బాబు(54) బుధవారం సాయంత్రం కోదాడ పట్టణానికి వచ్చి స్నేహితులతో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్నేహితులు సీపీఆర్ చేసి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేసినప్పటికీ ప్రయోజనం లేక పోవడంతో మృతిచెందారు.